మౌలిక వసతుల కల్పన నా వంతు కృషి చేస్తా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



అంబర్‌పేట డివిజన్లో బస్తీబాటలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: ప్రజలకు మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, సౌకర్యాల కల్పనకు తనవంతు చొరువ తీసుకుంటానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి బస్తీబాట పేరిట సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలో అధికార యంత్రంగంతో కలిసి ఆయన పర్యటించారు. నియోజకవర్గంలోని అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్, చెన్నారెడ్డి నగర్, బాగ్‌అంబర్‌పేటలోని తూరాబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, తాగునీటి సమస్యను ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్ యాదవ్, అమృత, నాయకులు భూషన్‌చారి, చూక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



కార్మికులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బ్రహ్మకుమారీస్

చిక్కడపల్లి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. చిక్కడపల్లి బ్రాహ్మ కుమారీస్ శాఖ ఆధ్వర్యంలో శుభ దివాళి.. స్వచ్ఛ దివాళి కార్యక్రమంలో భాగంగా సోమవారం చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ శాఖ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు, బిస్కెట్లు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. బ్రహ్మకుమారీస్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ సేవ గుణాన్ని అలవార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవోహెచ్ ప్రవీణ, చిక్కడపల్లి శాఖ ఇన్‌చార్జి జయశ్రీ, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రిష్మిత, విశ్వనాథ్, రాజేష్, ఎస్ఎస్ గోవర్ధన్, బీఆర్ఎస్ నేత ముఠా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కాచిగూడ: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన పవన్ (22) చికెన్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన డిగ్రీ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి వారంరోజుల క్రితం తనతో తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పవన్‌పై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలికను భరోసా సెంటర్‌కు తరలించారు. డీఎస్ఐ వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7వ తేదీ నుంచి హిందూ ఆధ్యాత్మిక సేవా మేళా



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: హిందూ ఆధ్యాత్మిక సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నాలుగు రోజుల పాటు హిందూ ఆధ్యాత్మిక సేవా మేళాను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని కమలానెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే ఈ మేళాకు మంత్రి శ్రీధర్‌బాబు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వి.సుబ్రమాణ్యంలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. పాఠశాలకు వెళ్లే పిల్లలలో మానవీయ విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు సుమారు 5 వేల మంది విద్యార్థులు ఈ మేళాకు హాజరవుతారని 120కి పైగా ఆధ్యాత్మిక సమాజ సేవా సంస్థలు సేవల గురించి సమాచారాన్ని ప్రదర్శిస్తాయని తెలిపారు. 10వ తేదీన పరమవీర్ చక్ర అవార్డు గ్రహీత మేజర్ యోగేంద్ర యాదవ్ పరమ వీర్ వందన్ కార్యక్రమంలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామ్మూర్తి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి విక్రమ్ సింహా, సభ్యులు ఎస్.పద్మజ, ఆర్.రామ్‌రెడ్డి, వి.సురేష్ పాల్గొన్నారు.

యాదవ కులస్తులకు అండగా ప్రభుత్వం

అఫ్జల్‌గంజ్: సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం ఎంతో గర్వకారణమని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర యాదవ మహాసభ నాయకులు బజ్జు గోప్ యాదవ్ పేర్కొన్నారు. గత పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని యాదవ కులస్తులు పలుసార్లు అడిగినా మాజీ సీఎం కేసీఆర్ యాదవుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. యాదవ కులస్తులు విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దీపావళి వేడుకల సందర్భంగా నిర్వహించే యాదవుల సదర్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా ప్రకటించడంతో లక్షలాది మంది యాదవులంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. యాదవ కులస్తులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే యాదవ కులస్తులకు న్యాయం జరిగిందన్నారు.

మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం
వర్షకాలంలోపు పూర్తి చేయండి

- నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో అవస్థలు పడుతున్నారు
- నాగోల్ నుంచి వచ్చే రహదారికి ఈ బ్రిడ్జి అడ్డంకి కావొద్దు
- అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



మూసారంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వచ్చే వర్షాకాలంలోపు ముసారాంబాగ్ బ్రిడ్జి పనులను పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. తీవ్ర జాప్యం జరగడంతో నిత్యం వేలాదిమంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల్లో తలెత్తుతున్న ఇబ్బందులను అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

◆ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచడానికి తక్షణమే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తే తాము హాజరై చేయూతను ఇస్తామన్నారు. రెండు ప్రధాన ప్రాంతాలను కలిపే బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరిగితే నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే తాత్కాలికంగా ఒకవైపు నుంచే వాహనాలను అనుమతిస్తున్నారని.. రెండు వైపుల అనుమతిచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు.

నాగోల్ నుంచి నిర్మిస్తున్న 100ఫీట్ల రోడ్డును ఎలా కనెక్ట్ చేస్తారు.?

◆ నాగోల్ నుంచి అంబర్‌పేటకు నిర్మిస్తున్న వంద ఫీట్ల రోడ్డు దాదాపు పూర్తి కావొచ్చింది అటు వైపు నుంచి వచ్చే వాహనాలకు ఇక్కడ నిర్మించే బ్రిడ్జి అడ్డుగా మారుతోంది. దీనిని ఎలా పరిష్కరిస్తారని ఎమ్మెల్యే సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రశ్న లేవనెత్తారు. దీనిపై అధికారులు ఒకరి మోఖం ఒకరు చూసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనికి ఒక పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదే అని అన్నారు. ప్రత్యామ్నాయంగా ఒక సర్వీస్ రోడ్డు, ఒక ర్యాంపు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పనులు కేవలం 20 శాతమే అయ్యాయని దీనిపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షకాలంలో పూర్తి కాకుంటే ఇబ్బందులు పునరావృతం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు రోహిణి, రేణుక, రమేశ్, ప్రశాంత్, ప్రశాంతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భూదాన్ సాగర్‌రెడ్డి, నాయకులు

నల్లకుంట: మాజీ ఎమ్మెల్సీ, దివంగత ఎస్. ఇంద్రసేనారెడ్డి జ్ఞాపకార్థం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సంఘ సేవకుడు భూదాన్‌సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శంకమఠం మార్కెట్ రోడ్డులో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్, సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డిలతో కలిసి సాగర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, హరినాథ్, శరత్, మధు, బీఆర్ఎస్ నాయకుడు ఎం.భూపతినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్‌లో..



చిక్కడపల్లి: ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టి ఆదరిస్తే ఎంతో పుణ్యమని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చేపూరి లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం పొద్దుటూరు నరసింహరావు, తమ్మన రవితేజల సౌజన్యంతో వారు ప్రారంభించారు.

రాము లలితగీతాలు లయ ప్రాసతో ఉంటాయి

తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి



కవితా సంపుటి ఆవిష్కరణలో జ్యోతి వెలిగిస్తున్న ఆచార్యలు శివారెడ్డి, గౌరీశంకర్

చిక్కడపల్లి: రాము లలిత గీతాలు లయ ప్రాసతో ఉంటాయని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణలో ప్రఖ్యాత కవి డాక్టర్ ఎం.కె.రాము రచించిన మధురోహాలు కవితా సంపుటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సాహితీవేత్త ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ రాము ఆధునిక లలిత గీతకారుల్లో ప్రముఖులని అన్నారు. పాట లయ తెలిసిన వారికి పాట రాయటం సులువైపోతుందన్నారు. రచయితల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డా. నాలేశ్వరం శంకర్ మాట్లాడుతూ.. ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత కమిషనర్ నరసంహప్ప సంపూర్ణ జ్ఞాన సంపుటి మధురోహాలు తనకు అంకితం ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు మాట్లాడుతూ.. అక్షర యజ్ఞం చేసి కవి మధురోహాలులో భావ స్పష్టీకరణ మనస్సును హత్తుకుంటాయని అన్నారు.

ఇళ్ల పంపిణీలో మొదటి ప్రాధాన్యం కార్మికులు ఇవ్వాలి

ముషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మొదటి ప్రాధాన్యం మున్సిపాలిటీ కార్మికులకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నూటికి 80 శాతం దళిత, పేద వర్గాలు పారిశుద్ధ్య కార్మికులుగా ఉన్నారని పేర్కొన్నారు. కార్మికుల జీవితాలు మారినప్పుడు నిజమైన ప్రజాపాలన అని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 9న భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజన్నా, నరేష్, శ్యామ్‌రావు, చందు, తిరుమల్లేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న సమితి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర వీరశైవ ధర్మ ప్రచార సమితి ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కడ్లి రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కోఠిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లు రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా ఎదగాలంటే కులగణన సమయంలో తాము వీరశైవ లింగాయత్ కులానికి చెందినవారమని, బలిజా అని, లింగాయత్ అని లేక ఇంకా వేరే పేర్లు చెప్పకూడదని సూచించారు. వీరశైవ లింగాయత్‌లను ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా పిలుస్తారని, కొన్ని ప్రాంతాల్లో లింగాయత్‌లను బలిజ, వాణి అని పిలుస్తారని, అలా కాకుండా కులగణన చేసే అధికారులకు వీరశైవ లింగాయత్‌లని చెప్పాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం వీరశైవ లింగాయత్‌లకు రాష్ట్ర కార్పొరేషన్లకు చైర్మన్‌గా నియమిస్తే సముచితంగా గౌరవించినట్లు అవుతుందన్నారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు దిగంబర్‌రావు, రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు సిద్ధేశ్వర్, నర్సిములు, శ్రీశైలం, నీలప్ప, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న బీసీ కులగణనలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను కులంగా కాకుండా వృత్తులుగా పేర్కొనడం పట్ల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను వంచనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన కులగణన ఫార్మెట్‌లో జరిగిన పొరపాటును వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. సాంప్రదాయ వృత్తులైన కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తులను నిర్వహిస్తున్న వారందరినీ ఒకే జాతులుగా గుర్తించాలని కోరారు. పొరపాట్లను సరిద్దిద్దకుండా కుల గణన జరిపితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాల్‌కోట వెంకటచారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

కాచిగూడ: రైలు దిగుతూ తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ రాగి ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డికి చెందిన జీడి సిద్ధయ్య(70) ఆదివారం వికారాబాద్ నుంచి రైలులో వస్తూ విద్యానగర్ రైల్వేస్టేషన్‌లో దిగుతుండగా కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదర్‌లో 22 సెల్‌ఫోన్ల చోరీ

కాచిగూడ: నారాయణగూడ చౌరస్తాలో జరిగిన సదర్ వేడుకల్లో 22 సెల్‌ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సదర్ ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు దున్నరాజుల విన్యాసాలను మైమరచి చూస్తుండగా ఇదే అదనుగా భావించిన దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి సెల్‌ఫోన్లను దొంగిలించారు. బాధితులు ఆదివారం, సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఐ నాగార్జున, డీఎస్ఐ వెంకటేష్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

- కార్తీకమాసం తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- భక్తులతో పోటెత్తిన శివాలయాలు



న్యూ రామాలయంలో క్షీరాభిషేకం చేస్తున్న వేదపండితుడు



నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలకు కార్తీకమాస శోభ సంతరించుకుంది. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిలకిటలాడాయి. వేకువ జాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకున్నారు. శివ నామ స్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. న్యూరామాలయం ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. కార్తీక మాసోత్సవాలు డిసెంబర్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు తెలిపారు. శంకరమఠంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, లింగాలగడ్డ శివాలయం, తిలక్‌నగర్‌లోని శివాలయంలో మహా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశేషంగా తరలి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్తలు ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.మధుకుమార్, వై. మురళీ, మధుసూదన్, మురళీకృష్ణ, ఆర్. ఓంప్రకాష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

మొదటి సోమవార కార్తీకమాస మహోత్సవాలు..

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీగణపతి పార్వతీ సమేత క్షీరలింగేశ్వర స్వామి, వివేక్‌నగర్‌లోని స్వయంభూవుగా వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక మొదటి సోమవార పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిన్నట్లు ఆలయాల ఈవోలు పి.లక్ష్మారెడ్డి, ఎం.దేవనాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయాల అర్చకులు బుగ్గలక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి, కాశీపతి, భవనందశర్మ, జగన్‌మోహనాచారి, గోపాలాచారి, బుచ్చమాచారి పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లోని శివాలయాల్లో..

ముషీరాబాద్: కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో ముషీరాబాద్ భోలక్‌పూర్‌లోని శివాలయాల్లో భక్తులు వేకువజాము నుంచే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదయ శాఖ ఈవోలు జ్యోతి, మహేందర్‌కుమార్, ఆలయ సిబ్బంది సురేష్, ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటుపై హర్షం

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ కులాల వారీగా జనాభా లెక్కలు తీస్తే రిజర్వేషన్ల పెంపు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు సాధ్యమవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచడానికి బీసీల జనాభా లెక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటుతో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లపై న్యాయపరంగా ఉన్న అడ్డంకులు అన్ని తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నందగోపాల్, కోల జనార్దన్, మట్ట జయంతి, మధు, సత్యంగౌడ్, రామారావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే



సమగ్ర కుటంబ సర్వే సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ఈనెల 6వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సర్కిల్–16 డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. సోమవారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సర్వే చేపట్టే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంసీ హాజరై సర్వేపై చేపట్టాల్సిన అంశాలను వివరించారు. సర్కిల్ పరిధిలో సుమారు 700 మందిని సర్వే కోసం వినియోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చిన తమ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా సర్వేను నిర్వహించాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారిణి రజిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నేడు

కాచిగూడ: బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 5వ తేదీన మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. 33 జిల్లాల నుంచి అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు పాల్గొంటారని అన్నారు. విద్యార్థుల సమస్యలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం భవిష్యత్‌లో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి కృషి



నందరాజ్‌నగర్‌లో నాలా సమస్యను పరిష్కరిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: బస్తీల్లో తరుచు మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం నందరాజ్‌నగర్, మందుల బస్తీల్లో వర్షపు నీటి నాలాల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు సమస్య తలెత్తింది. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులతో కలిసి మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

అమరవీరుల వర్ధంతి సభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరణ

ముషీరాబాద్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఈఎస్ విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరవీరుల వర్ధంతి సభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ హాజరై మాట్లాడారు. విప్లవ విద్యార్థి ఉద్యమ గమనంలో అనేక మంది విప్లవ విద్యార్థి రత్నాలు అమరులయ్యారని అన్నారు. విప్లవ విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు అమరవీరుల వర్ధంతి సభలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె.ఝాన్సీ, యశ్వంత్, సంతోష్, రాము, రమేష్, నితిన్, వెంకట్, అశ్విన్, సుజాత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శిగా వెంకటేష్

ముషీరాబాద్: సీపీఎం ముషీరాబాద్ జోన్ నూతన కార్యదర్శిగా ఆర్.వెంకటేష్ ఎన్నికయ్యారు. సోమవారం గోల్కొండ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ 4వ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.దశరథ్, టి.మహేందర్, ఆర్.ఈశ్వర్‌బాబు, పి.విమల, కె.రమేష్, ఏకే పాషాలతో పాటు మరో 15 మందిని ఎన్నుకున్నారు.

నిరసన తెలిపే హక్కు కూడా లేదా..?

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరసన తెలిపే కనీస ప్రజాస్వామిక హక్కును కూడా కాలరాస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్‌ముదిరాజ్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో వారాసిగూడ పోలీసులు నాగేష్‌ముదిరాజ్‌ను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజల తరఫున ఉండి పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.